# సోములు మనసు

"ఇందాకటి నుంచి బిడ్డని అలా కొడుతున్నావు ఏం తప్పుచేసాడనీ? లచ్చమ్మా," అని అడిగింది జానకి, డాబా పైనుంచి కింది పూరింటి ముందు జరుగుతున్నది చూస్తూను.

"పిల్లల్ని చిన్నప్పటి నుంచీ చెప్పుచేతల్లో పెట్టుకోకపోతే, పెద్దయినాక మనమాట వినరు అమ్మగారూ, కూలికి పోరా, అంటే వినడు" అంది లచ్చమ్మ.

"అలా, పిల్లవాణ్ణి రూల్సుపెట్టి భయపెట్టి పనులు చేయించకూడదు, వాళ్ళ ఇష్టాన్ని కూడా మనం గమనించాలి" అంది జానకి.

"వాళ్ళ ఆలోచనలు ఏమిటో తెలుసుకోవాలి. వాళ్ళ ఆలోచనల్లో వాళ్ళని పెరగనివ్వాలి. ఎందుకు పనికి పోనంటున్నాడో అడిగి తెలుసుకో" అంది.

"ఇంతలోకీ ఏంటే, ఏటా గొడవ?" అంటూ లచ్చమ్మ మొగుడు గంగులు, రిక్షా వాకిట్లో ఆపి లోపలికి వస్తూ అడిగాడు.

"కూలికి పొమ్మంటే పోనంటున్నాడు. పిల్లలతో ఆడుకుందుకు పోతానంటున్నాడు" అంది లచ్చమ్మ.

"సోములూ! ఇలారా!"అని పిలిచాడు గంగులు కొడుకుకేసి కళ్ళెర్రజేసి చూస్తూ.

"ఎందుకూ?" అంటూ బిక్కమొగం పెట్టుకుని తండ్రి దగ్గిరకి వచ్చాడు.

భయపడుతూ, భయపడుతూ "అయ్యా కొడతావా?" అంటూ ఏడుపు మొగం పెట్టుకుని సోములు తండ్రి దగ్గిరకి వచ్చాడు.

కళ్ళెర్ర జేసి చూస్తూ, "ఏందిరా నీ ఇష్టం వచ్చినట్లు ఉందామనుకున్నావా? నీతాత మనకేం డబ్బులు మూట ఇచ్చి పోలేదు" గట్టిగా అరుస్తూ కోపంతో వెన్నుమీద చరిచాడు.

ఆ దెబ్బకి 'అమ్మా' అంటూ అరిచాడు, సోములు.

"ఏంటదీ అట్టాగట్టిగా కొట్టినావు బిడ్డ ఏమైపోతాడు?" అంటూ లచ్చి వెళ్ళి సోముల్ని దగ్గిరకి తీసుకుని వెన్ను నిమిరింది.దాంతో మరీ కోపం పెరిగిపోయింది. గంగులుకి.

"నేను పిల్లాడికి భయం చెప్పాలనుకుంటే నీవేంటి లెగు పక్కకు పో" అన్నాడు.

దాంతో లచ్చికి కోపం పెరిగి "నేను మెల్లగా చెపుతుంటే నువ్వేటి పిల్లాణ్ణి బెదిరిస్తావు?" అని గంగులు మీదకి వెళ్ళింది.

సోములు, ఏడుస్తూనే తను నుంచున్న చోటి నుంచి వెనక్కి వెనక్కి నడిచాడు, తల్లీతండ్రీ దెబ్బలాడుకోడం చూసి, మనసు బెదిరిపోయి చొక్కాచేత్తో కళ్ళు తుడుచుకుంటూ భయపడ్డాడు.

మనసు దడదడలాడింది. ఏదో భీతి మనసుని ఆవరించింది. అటు ఇటూ దిక్కులు చూసాడు.

ఇరుగు పొరుగూ వాళ్ల గుమ్మాల దగ్గరనుంచి వింతగా ఆశ్చర్యంగా కొందరు, మరి కొందరు హాస్యంగానూ చూస్తున్నారు. సోములుకి ఏదో అవమానం అయిపోయింది. బుర్ర పనిచేయలేదు.

వెంటనే శక్తి కొలదీ ఆ పదేళ్ళవాడు పరుగు తీసాడు.

"సోములూ రారా ఏడకి పోతావురా," అంటూ అరిచి "వెధవ వాడే వస్తాడు. పోనీ" అంటూ గంగులు గుడిసెలోకి పోయాడు. వెనకాలే లచ్చి గొణుక్కుంటూ వెళ్ళింది. అంతవరకూ వింతగా పొరుగింటి దెబ్బలాట వింటూ చూస్తున్నవాళ్ళు అంతా తమ ఇళ్ళల్లోకి పోయారు.

చినుకు చినుకు గాలివాన అయినట్లు సోములు కనిపించడం మానేసాడు.

దాంతో గంగులూ, లచ్చి బెంగతో అన్నం సరిగా తినడం మానేసారు. గుడి అరుగుమీదా, బస్సు స్టాండులోనూ, రైలుస్టేషనులోనూ వెతికారు ఎక్కడా కనిపించలేదు. దాంతో "ఎక్కడికి పోయాడో బిడ్డ ఆకలికి ఉండలేడు" అని లచ్చి ఏడవడం మొదలెట్టింది. ఇరుగూ పొరుగూ ఊరుకోమ్మని అంటూ వచ్చారు.

"అయ్యో బిడ్డ కనిపించడం లేదని లచ్చమ్మ ఏడుస్తుంటే ఊరుకో ఊరుకో అంటుందేమిటి?" అని మరొకరు ఆ మాటను ఖండించారు.

జానకి డాబా మీంచి అంతా చూస్తూనే ఉంది... వింటూనే ఉంది.

"అయ్యో పాపం ఎక్కడికి పోయాడో ఏమిటో" అనుకుంది.

వెంటనే లచ్చిని కేకవేసి "తప్పిపోయాడని, రేడియోలో ప్రకటన ఇద్దాం. పేపర్లో నేను రాసి పంపుతా" అని జానకి చెప్పేటప్పటికి లచ్చికి గంగులుకి కొండంత ధైర్యం వచ్చింది.

అయితే రేడియోలోనూ, పేపర్లోనూ ప్రకటనలు ఇచ్చినా లాభం లేకపోయింది. సోములు జాడ తెలియలేదు.

"అమ్మా జానకమ్మా! నువ్వు చెపుతానే వున్నావ్? పిల్లవాణ్ణి కొట్టొద్దనీ ఇలా ఉండు అలా ఉండు అంటూ శాసించవద్దన్నావు..." అంటూ లచ్చి ఏడ్చింది.

సోములు మాత్రం ఇంక రాడని, తమకిక లేడనీ దిగులుగా ఉన్నారు.

సోములు ఆ వేళ, వెళ్ళి వెళ్ళి రైలు స్టేషన్‌లో పడుకుని నిద్రపోయాడు. ఏడ్చి ఏడ్చి ఉన్నాడేమో వళ్ళు తెలియని నిద్ర....ఆ బండనేల మీద పడుకున్న వెంటనే నిద్ర పట్టేసింది.

ఇంకా తెల్లవారలేదు చీకటిగా ఉంది. స్టేషన్‌లో ఏదో పేసింజరు ఆగి ఉంది. మనసులో ఇంటికి వెళ్ళాలని ఉంది. కాని పౌరుషం అడ్డువచ్చింది. బతకలేకపోతానా? అని ఆ పదేళ్ళ వాడు ఆ పేసింజరు ఎక్కేసాడు.

తెల్లారింది. హైదరాబాద్ వచ్చింది. స్టేషన్‌లో దిగాడు.విపరీతమైన జనం.... తోసుకుంటూ పోతున్నారు.వాళ్ళతో గేటుదాకా వచ్చాడు. అక్కడ గేటు దగ్గర అందర్నీ టికెట్టు టికెట్టు అని అడుగుతున్నాడు.

సోములు భయపడి, పక్కకి తప్పుకున్నాడు తన దగ్గిర టికెట్టు లేదని.

తప్పు చేసావు తప్పు చేసావు అని మనసు ఘోషిస్తుంది. ఏం చెయ్యలేడు. పట్టాల మీంచి పారిపోదాం అనిపించింది. మళ్ళీ రైలు కింద తలపెట్టి చచ్చిపోతేను అని మళ్ళీ ఆలోచన వచ్చింది.

చంటి పిల్లాణ్ణి ఎత్తుకుని మరో చేత్తో పెట్టె పట్టుకుని ఇబ్బంది పడుతున్న ఓ అమ్మ కనిపించింది. అమ్మ నన్నుకూడా ఇలా ఎత్తుకుని పెంచి ఉంటుంది. అనుకుని కళ్ళు తడి అయి, మనస్సు చివుక్కుమంది సోములుకి.వెంటనే ఎదురు వెళ్ళి ఆ అమ్మచేతిలో ఉన్న పెట్టీ వాటర్‌బాటిలూ పుచ్చుకుని, "నేను సాయం చేస్తానమ్మా" అని జాలిగా అన్నాడు.ఆమె పెట్టిచ్చుకుని గేటులోంచి ఆమె వెనకాలే వెళ్ళిపోయాడు.

టీ.సీ కనిపెట్టలేదు అమ్మయ్య అనుకుని "ఆటో దగ్గిరకి తీసుకువెళ్ళనా" అన్నాడు సోములు.

"బాబూ సమయానికి సాయం చేసావు, ఇందా ఈ రూపాయి తీసుకో" అంది.

రూపాయి తీసుకుని, "అమ్మా నమస్కారం వెళ్ళతాను" అన్నాడు.

ఆటోరిక్షా ఎక్కి కూచుంటూ "ఎక్కడికి వెళతావ్ నీ పేరేమిట?" అని అడిగింది ఆమె. "నాకు ఎవరూ లేరు ఒక్కణ్ణే. ఈ ఊరు కొత్త." అని ఏడ్చేసాడు.

"మరి మీ అమ్మ నాన్నా వున్నారా?" అంది ఆమె.
"ఉన్నారు, నన్ను కొట్టారని కోపం వచ్చి ఇంట్లోంచి పారిపోయి వచ్చేసాను." అన్నాడు.
"ఐతే ఇంత పట్నంలో ఎక్కడ బతుకుతావు మా ఇంటికి రా, మా అబ్బాయిని ఎత్తుకుని ఆడిద్దువుగాని నీకు ఇంత అన్నం పెడతాను" అంది."అలాగేనమ్మా!" అంటూ ఆటో ఎక్కాడు సోములు.ఆ ఇంటి పరిస్థితి అంతా గమనించాడు, అయ్యగారు ఆమె ఉద్యోగానికి పోతారు. వెళ్ళేటప్పుడు పిల్లవాణ్ణి క్రెష్‌లో పెడతారు.
ఆమె ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తీసుకువచ్చుకుంటుంది. క్రెష్‌లో దింపి వెళతానంటే ఆమూడేళ్ళవాడు ఏడుపు... వద్దు వద్దు... అని.
"అమ్మా నువ్వు సాయంకాలం దాకా రావా, కనిపించవా?" అని ఏడుపు.
పిల్లలకు ఇష్టంలేని పనులు ఈ పెద్దాళ్ళు ఎందుకు చేస్తారో, నన్ను కూలికి పొమ్మని నన్ను మావాళ్ళు ఏడిపించినట్లే వీళ్లూను. పెద్దవాళ్ళు వాళ్ళకి వీలుగా బతుకుతారు, పిల్లల మనస్సు ఎందుకు తెలుసుకోరు? వాళ్ళ మనసుకి వచ్చినట్లు ఎందుకు ఎదగనీరు? అని సోములు బాధపడసాగాడు.
ఇంతట్లోనే పక్కింటిలోంచి కేకలు, పెద్దగా అరుస్తున్నారు. కిటికీ దగ్గరికి వెళ్ళి విన్నాడు సోములు.
"నేను డాక్టర్ చదవను, ఇంజినీరింగే చదువుతాను" అని ఆ అబ్బాయి. తల్లీ తండ్రీ "మేము చెప్పినట్లు వినాల్సిందే" అని కేకలు.గంట అయినా, వాళ్ళ దెబ్బలాట తేలలేదు.
"నా జీవితం మీద నాకు హక్కు లేదా పెద్దవాళ్ళు చెప్పినట్లు చెయ్యాలా?" అని అరుస్తున్నాడు.
వాళ్ళ అక్కగారు అక్కడికి వచ్చి "బాధపడకురా! నాకీ పెళ్ళి వద్దు, ఆ పిల్లవాడు నాకు నచ్చలేదు అంటే వినక పెళ్ళి చేసారు నాకు ఇష్టం లేకుండాను. అయినా అత్తవారింటికి వెళ్ళవలసిందే అని శాసిస్తున్నారు. చదువుకున్న వాళ్ళు వాళ్ళ ఇష్టం వచ్చినట్లు బ్రతకనిద్దాం అనే ఆలోచనలేదు వాళ్ళకి" అంది.
సోములుకి, లోకం చూస్తున్న వీళ్ళ మాటలు విన్నాక తన జీవితం ఏమిటో తనకి అర్థం అయింది.తను కూలికి పోయి సంపాదిస్తేనే కాని వీల్లేదని అయ్యా అమ్మ తిడితేనేకదా తను ఇల్లు వదిలేసి వచ్చింది, అయితే ఇప్పుడే ఇంటికి వెళ్ళి నా తెలివి ఉపయోగించి నేను ఆలోచించుకుని ఎలా బ్రతకాలో నిర్ణయించుకుంటాను అని

చెప్తాను అని సోములు తిరిగి ఇంటికి జారుకున్నాడు.గంగులుకు లచ్చమ్మకీ ఎంతో ఆనందం అయింది.

"నువ్వు కనపడక ఎంత దిగులు పడ్డామో" అన్నారు.

సోములు "నేను తిరిగివచ్చాను కాని అన్నింటికీ మీరు చెప్పినట్లే వినమంటే వినను. నేను సొంతంగా ఆలోచించి నాకు ఎలా బ్రతకాలని ఉందో అలా బ్రతుకుతాను. నా బతుకు నన్ను బ్రతకనివ్వండి. పిల్లలను ప్రేమగా చూడండి. కాని, ప్రతి నిమిషం మీరు చెప్పినట్లే వింటే మా బ్రతుక్కి అర్థం ఉండదు. మాకూ ఏవో ఆశయాలు ఉంటాయి" అని కచ్చితంగా చెప్పాడు సోములు.

'అలాగే బాబూ నువ్వు చెప్పిందీ నిజమే" అన్నారు వాళ్లు.

"జానకమ్మగారూ నా బిడ్డ వచ్చేసాడు" అని చెప్పింది ఆనందంతో లచ్చమ్మ.

❄❄❄

(రేడియో 2001)